


# కాంగ్రెస్ మరో ధోకా

- ఎన్నికల ముందు ఓటర్లపై హామీల వల
- పింఛన్లు రెట్టింపు చేస్తామన్న రేవంత్‌రెడ్డి
- రూ.2 వేల పెన్షన్ రూ.4 వేలు ఇస్తామని హామీ
- అర్హులందరికీ పెన్షన్లన్న కాంగ్రెస్
- అధికారంలోకి వచ్చాక కొత్తవి ఇవ్వలే.. పాతవి పెంచలే
- 16 నెలలవుతున్నా గదే పాత పింఛన్ల పంపిణీ
- కొత్త దరఖాస్తుల స్వీకరణపైనా కరువైన స్పష్టత
- ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది ఎదురుచూపులు

### పత్తాలేని పింఛన్ పెంపు..

ఆరు గ్యారంటీల్లో భాగంగా చేయూత కింద రూ.4 వేల చొప్పున పెన్షన్ ఇదిస్తామని కాంగ్రెస్ చెప్పింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ అగ్రనేతలంతా ఇదే పాట పాడారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీతో పాటుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే సైతం పదేపదే పింఛన్ పెంపు అంశాన్ని ప్రస్తావిస్తూ ఓట్లు అభ్యర్థించారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్ల పెంపు హామీని నిలబెట్టుకోలేక పోతున్నది. అసలు పెంచుతారా.. పెంచరా? కొత్తవి ఇస్తారా.. ఇవ్వరా? అన్నది కూడా స్పష్టం చేయకుండా కాలం వెళ్లదీస్తున్నది. మరోవైపు, మాట తప్పిన సర్కారుపై లబ్ధిదారులు రుసరుసలాడుతున్నారు. గ్రామాల్లోకి వస్తున్న ప్రజాప్రతినిధులను పింఛన్ల పెంపుపై అక్కడక్కడ నిలదీస్తున్నారు. ఇటీవల నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు వచ్చిన స్థానిక ప్రజాప్రతినిధిని ప్రశ్నించడం మహిళల్లో వ్యక్తమవుతున్న ఆగ్రహానికి నిదర్శనంగా నిలిచింది.

నిజామాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అధికారమే పరమావధిగా ఎన్నికల ముందర అనేక హామీలు గుప్పించిన కాంగ్రెస్ పార్టీ.. గద్దెనెక్కాక ఏ ఒక్కటీ అమలు చేయకుండా చేతులెత్తేసింది. రుణమాఫీ, రైతు భరోసా తదితర హామీలను పూర్తి చేయకుండా ఎగ్గొట్టిన రేవంత్ సర్కారు.. పింఛన్ల విషయంలోనూ రిక్త'హస్తమే' చూపింది. సామాజిక పెన్షన్ కింద ఇస్తున్న మొత్తాన్ని రెట్టింపు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక లబ్ధిదారులకు 'చేయి'చ్చింది. 16 నెలలవుతున్నా పింఛన్ల పెంపుపై నోరు మెదపడం లేదు. మరోవైపు, కొత్త పెన్షన్ల అంశాన్ని అటకెక్కించింది. దీంతో లక్షలాది మంది పేదలకు ఎదురుచూపులు తప్పడం లేదు.

### కేసీఆర్‌ది మానవీయ కోణం..

పింఛన్ల పంపిణీని మానవీయ కోణంలో చూసిన కేసీఆర్.. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు అండగా నిలిచారు. అప్పట్లో రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2,016కు పెంచారు. ఠంచన్‌గా లబ్ధిదారుల చేతికి డబ్బులు అందజేశారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఏ రందీ లేకుండా కాలం వెళ్లదీశారు. మరోవైపు, గతంలో ఏ ప్రభుత్వం కూడా ఎయిడ్స్, బోధకాలు వంటి దీర్ఘకాలిక రుగ్మతలతో బాధ పడుతున్న వారిని పట్టించుకోలేదు. కానీ కేసీఆర్ వచ్చాక వారికి పెన్షన్లు ఇవ్వడం ప్రారంభించారు. అలాగే, బీడీ కార్మికులతో పాటు కల్లుగీత కార్మికులు, నేతన్నలకూ సామాజిక పింఛన్లు అందజేసి ఆలంబనగా నిలిచారు. మరోవైపు, ఉమ్మడి రాష్ట్రంలో 65 ఏళ్లు నిండిన వారికే వృద్ధాప్య పెన్షన్లు ఇచ్చేవారు. కానీ కేసీఆర్ వయస్సు పరిమితిని 57 ఏళ్లకు కుదించి.. లక్షల మందికి చేదోడుగా మారారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ కుటుంబంలోనూ ఏదో రకంగా పింఛన్ అందుతుందంటే అది ముమ్మాటికీ కేసీఆర్ గొప్పతనమే. నిజామాబాద్ జిల్లాలో ప్రతి నెలా సుమారుగా 2,51,910 మందికి వివిధ రకాల పింఛన్లు అందుతున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.52.70 కోట్లు వెచ్చిస్తున్నది. కామారెడ్డి జిల్లాలో 1,53,879 మంది ప్రతి నెలా రూ.32.84 కోట్ల మేర లబ్ధి పొందుతున్నారు.

### రెట్టింపు చేస్తామని చెప్పి..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం కాంగ్రెస్ అనేక అలవి కాని హామీలు ఇచ్చింది. బీడీ కార్మికులు, వృద్ధులు, వితంతువులను లక్ష్యంగా చేసుకుని పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలు చేస్తామని ప్రకటించింది. అలాగే, అర్హులందరికీ కొత్త పెన్షన్లు అందిస్తామని రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలందరూ ఊదరగొట్టారు. అంతేకాదు, రాష్ట్రంలో 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకూ రూ.2,500 చొప్పున సాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 16 నెలల కాలం గడిచి పోయింది. పింఛన్ల పెంపు, కొత్తవి మంజూరు అంశంపై రేవంత్ సర్కారు కిమ్మనడం లేదు. అంతేకాదు, నెలనెలా ఇవ్వాల్సిన పెన్షన్లలో జాప్యం చేస్తున్నది. ఈ నెలది వచ్చే మాసంలో, ఆ నెలది ముందు మాసంలో అందిస్తూ వస్తున్నది.



### నెలనెల ఇత్తలేరు..

ఎలచ్చన్లల్ల ముసలోల్లకు నాలుగు వేల పింఛిన్ ఇత్తా అన్నావ్ గదా? మల్ల ఏమైంది సారు. ఇప్పటిదాకా పింఛిన్లు పెంచింది లేదు. మును పటి లెక్కనే నెలకు రెండు వేలు ఇత్తుండ్రు. అది కూడా పోయిన నెలది ఇప్పుడిత్తుండ్రు. ఈ నెలది ఇంకో నెలకిత్తిండ్రు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు గిట్ల లేకుండే. ఏ నెలకు ఆ నెల ఇచ్చేత్తుండ్రి. కూరగాయలు, కిరాణ సామాన్ల ధరలు బాగా పెరిగినాయ్. రెండు వేలకు ఏం అత్తలేదు. గిప్పుడైనా పింఛిన్లు పెంచితే మంచిగుంటది.

**- నీలి వెంకటి, వృద్ధుడు, కోటగిరి**

### గదే రెండు వేలు ఇత్తుండ్రు..



కాంగ్రెస్ సర్కారు అత్తే నాలుగు వేల పింఛిన్ అత్తదని ఆశ వడితిమి. ఎలచ్చన్లు ఎప్పుడో అయిపోయినయ్. రేవంత్ సారు ముఖ్య మంత్రి అయిండు గనీ ఇప్పటి దాకా పింఛిన్ పెంచకపాయే. కేసీఆర్ సారు ఉన్నప్పుడు ఇచ్చినట్లే గీళ్లు కూడా గదే రెండు వేలు ఇత్తుండ్రు. కేసీఆర్ సారు నెలనెల పింఛిన్లు ఇత్తే, గీళ్లు ఎనుకాముందు పంచుతుండ్రు.

**- పోశవ్వ, వృద్ధురాలు, కోటగిరి**

### మాట నిలబెట్టుకోవాల్నా..లేదా?



ముసలోల్లకు నాలుగు వేల రూపాల పింఛిన్ ఇత్తమని మాట ఇచ్చిండ్రు. మాట నిలబెట్టుకోవాల కదా? గిన్ని రోజులయిం ది. ఎలచ్చన్లు అయిపోయి ఏడాది అయిపాయే. పింఛిన్లు మాత్రం పెంచుతలేరు. గదే పాత రెండు వేలు ఇత్తుండ్రు. అదన్న టైంల ఇత్తుండ్రా అంటే లేదు. రేవంత్ సారు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలే.

**- కనకవ్వ, వృద్ధురాలు, కోటగిరి**

### నాలుగు వేలంటిరి.. ఏమైంది?



కోటగిరి, ఏప్రిల్ 14: ఓట్లప్పుడు కాంగ్రెసోళ్లు అచ్చి రెండు వేల పింఛిన్‌ను నాలుగు వేలు జేత్తామని మాట ఇచ్చిండ్రు. అది జేస్తాం. గిది జేస్తామని మస్తు మాటలు చెప్పిండ్రు. అందరం నమ్మి ఓట్లేసి గెలిపిస్తిమి. యాడాదిన్నర అయిపాయె. ఇప్పటికీ గదే రెండు వేల పింఛిన్ ఇత్తుండ్రు. అన్ని ధరలు పెరిగినయ్. పింఛిన్ పైసలతోని నెల గడుపుడు కష్టమైతుంది. ఇచ్చే రెండు వేలన్న టైంల ఇత్తలేరు. మస్తు పరేషన్ అయితుంది. రేవంత్ సారు నాలుగు వేలు ఇస్తా అని చెప్పే. గిన్ని రోజులైంది కదా ఆ ముచ్చటనే లేదు. కాంగ్రెసోళ్లు చెప్పినట్లు పింఛిన్లు పెంచితే మంచిగుంటుండే.

**-సాలే గంగవ్వ, వృద్ధురాలి, కోటగిరి**

# నాడు పురోగమనం నేడు తిరోగమనం



బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజల సురేందర్

- స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి
- రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- గ్రామాల్లో గులాబీ జెండా ఆవిష్కరించాలి
- ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

లింగంపేట, ఏప్రిల్ 23: బీఆర్ఎస్ పాలనలో దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉన్న తెలంగాణ.. నేడు అభివృద్ధిలో తిరోగమనం ప్రారంభమైందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. లింగంపేటలోని జీఎన్ఆర్ గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత రాష్ట్ర సమితి ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న రజతోత్సవ సభకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర తలసరి ఆదాయం నంబర్ వన్ ఉండగా.. ప్రస్తుతం 11వ స్థానానికి పడిపోయిందన్నారు.

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేసి, పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. త్వరలోనే బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ రజతోత్సవ సభకు బయల్దేరే ముందు గ్రామాల్లో గులాబీ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. కేటాయించిన లక్ష్యం మేరకు మండలం నుంచి సభకు తరలిరావాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, మాజీ వైస్ ఎంపీపీ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, గన్నూనాయక్, మ్యాకలికాడి రాములు, బొల్ల శ్రీకాంత్, గాండ్ల నర్సింహులుతోపాటు ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.



స్టాల్ వద్ద వివరాలు తెలుసుకున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

# ముగిసిన రైతు మహోత్సవం

- సలహాలు, సూచనలు అందజేసిన శాస్త్రవేత్తలు
- అనుభవాలు పంచుకున్న ఆదర్శ రైతులు

కంఠేశ్వర్, ఏప్రిల్ 23: రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన రైతు మహోత్సవం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన 130కి పైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటిని నిజామాబాద్‌తోపాటు కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్, జగిత్యాల జిల్లాల రైతులు సందర్శించారు. ఆధునిక సాగు ప రికరాలు, అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలు, మేలు జాతి పాడి పశువులు తదితర అంశాలను స్టాళ్లలో ప్రదర్శించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్యశాఖ అధికారులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ, తెలంగాణ ఉద్యానవన యూనివర్సిటీతోపాటు ఇతర పరిశోధన కేంద్రాల శాస్త్రవేత్తలు పాల్గొని, పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. చివరి రోజు స్టాళ్లను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్‌తోపాటు పలువురు నాయకులు, రైతులు సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో రైతు మహోత్సవం నిర్వహించడంతో జిల్లా రైతులతోపాటు కామారెడ్డి, జగిత్యాల, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల రైతులకు ఎంతో మేలు చేసిందని చెప్పారు. కలెక్టర్‌తోపాటు జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్‌రావు, వివిధ శాఖల అధికారులున్నారు.

# ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



పూజ (ఫైల్)

కామారెడ్డి, ఏప్రిల్ 23: ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో ఫస్టియర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో బుధవారం ఈ ఘటన చోటు చేసుకున్నది. ఎస్సై ఆంజనేయులు కథనం ప్రకారం.. భిక్కనూరుకు చెందిన రెడ్డి పూజ (17) కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నది. ఆమె తండ్రి గతంలో చనిపోగా, నానమ్మ గంగవ్వ వద్ద ఉంటూ రోజూ కామారెడ్డికి వెళ్లి వచ్చేది. అయితే, గంగవ్వ దేవునిపల్లిలో నివాసముండే తన కూతురు వద్దకు వెళ్లింది. మంగళవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో పూజ ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైంది. బుధవారం ఉదయం ఆమె ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నది. ఇది గమనించిన మనువడు మహేశ్ గంగవ్వకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో ఆమె హుటాహుటిన వచ్చి చూసే సరికి పూజ మంటల్లో కాలిపోయి కనిపించింది. సమాచారమందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.



రైతులకు నచ్చజెప్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి

# ధాన్యం కొనాలని రోడ్డెక్కిన రైతులు

- కొనుగోళ్లలో జాప్యంపై నిరసన
- రైతులకు నచ్చజెప్పిన ఎమ్మెల్యే పోచారం

పొతంగల్, ఏప్రిల్ 23: ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు రోడ్డెక్కారు. గన్నీ సంచులు, లారీల కొరత తీర్చాలని, కొనుగోలు చేసినా ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కోరుతూ పొతంగల్ చెక్‌పోస్టు వద్ద అన్నదాతలు బుధవారం ఆందోళన చేపట్టారు. రోడ్డుపై ద్విచక్ర వాహనాలు నిలిపి, అక్కడే బైఠాయించారు. సమస్యను పరిష్కరించేవరకు కదిలేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత ఉన్నదన్నారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు వేల సంఖ్యలో ఉన్నాయని అన్నారు. మిల్లులకు వెళ్లిన ధాన్యం బస్తాలను వెంటనే అన్‌లోడింగ్ చేయడం లేదన్నారు. దీంతో లారీలు రాక ఇబ్బంది పడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదే సమయంలో పొతంగల్ మీదుగా వెళ్తున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి విషయం తెలుసుకొని రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బుధవారం సాయంత్రం వరకు గన్నీ బ్యాగులతో పాటు లారీలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిజామాబాద్‌కు కాకుండా లోకల్ రైస్ మిల్లులకు అలాట్‌మెంట్ ఇవ్వాలని రైతులు కోరారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు

# బీఆర్ఎస్‌లో చేరికలు

సిరికొండ, ఏప్రిల్ 23: కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితికి చెందిన నాయకుడు మల్లెల సుమన్ బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సిరికొండలో నిర్వహించిన కార్యక్రమంలో ధర్పల్లి మాజీ జడ్పీటీసీ, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాజిరెడ్డి జగన్ అతడికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు, ఆయన విధానాలు నచ్చడంతో బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి భూషణ్‌రెడ్డి, మైలారం గ్రామశాఖ అధ్యక్షుడు భాస్కర్, సత్యానంద్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న సుమన్‌కు గులాబీ కండువా కప్పుతున్న బాజిరెడ్డి జగన్

## ఉగ్రదాడిపై నిరసన

**జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై** మంగళవారం జరిగిన ఉగ్రదాడిపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో బుధవారం కొవ్వొత్తులు, కాగడాల ర్యాలీలు నిర్వహించారు. పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో అమరులైన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని కోరారు.

-కంఠేశ్వర్, ఏప్రిల్ 23




నిజామాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న టీఎన్జీవో బాధ్యులు

# తెరపైకి జక్రాన్‌పల్లి ఎయిర్ పోర్ట్

- స్థలాన్ని పరిశీలించిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు
- ఈసారైనా మోక్షం లభించేనా..?

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 23: జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. జక్రాన్‌పల్లిలో ప్రతిపాదిత స్థలాన్ని ఎయిర్‌పోర్ట్ ఆఫ్ ఇండియా అథారిటీ అధికారులు బుధవారం పరిశీలించారు. జిల్లాలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు విషయంలో ప్రజలు ఆశలు వదులుకున్న తరుణంలో అధికారులు పర్యటించడంతో మరోసారి ఆశలు చిగురిస్తున్నాయి. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ.. ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం గతంలో ప్రతిపాదించిన స్థలంలో నిర్వహించిన సర్వేకు ఇప్పుడు ఏమైనా మార్పు వచ్చిందా అనే విషయంలో సర్వే నిర్వహించినట్లు చెప్పారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు ప్రతిపాదనలో ఉన్నదని తెలిపారు. దీంతో ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ కిరణ్మయి, గిర్దావర్ ప్రవీణ్, సర్వేయర్లు ధనియల్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎయిర్‌పోర్ట్ అధికారులు